

చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలి

మాడ్గుల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 12నుంచి 0-5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని డాక్టర్ మోహన్ తెలిపారు. మాడ్గుల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్యసిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారురు. చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయాలని ఈ సందర్భంగా డాక్టర్ మోహన్ సూచించారు

31 కేంద్రాల ఏర్పాటు

ఆమనగల్లు : ఆమనగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆదివారం చేపట్టే చుక్కల మందు పంపిణీ కార్యక్రమానికి ఏర్పాట్లు చేసినట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షైమునా బేగం ప్రకటనలో తెలిపారు.మండల పరిధిలోని 13 గ్రామ పంచాయతీ పరిధిలో 31 పోలియో చుక్కల పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈమేనరకు పల్స్‌పోలియో ఏర్పాట్ల వివరాలను ఆమె తెలిపారు. ఆమనగల్లు పీహెచ్‌సీ పరిధిలో 0-5 ఏళ్ల లోపు చిన్నారులు 3,445 మంది ఉన్నారని, నూటికి నూరు శాతం పల్స్‌పోలియో విజయవంతానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలియో చుక్కల పంపిణీకి మూడు రూట్లు ఏర్పాటు చేసి 134 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. 12న కేంద్రాలలో పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, ఆ తర్వాత 13, 14వ తేదీల్లో ఇంటింటికీ తిరిగి చుక్కలు వేయనున్నట్లు తెలిపారు.



జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. చెరువులు, కుంటలు, జలాశయాలు నిండుకుండలా మారాయి. వాగులు వంకలు పొంగిపొర్లాయి. దీంతో పాతాళ గంగ పైపైకి చేరుకుంది. అనేక మండలాల్లో భూగర్భ జలాలు భారీగా పెరిగాయి. అనేకచోట్ల బోర్లు, బావుల్లో దండిగా నీళ్లు చేరాయి. అల్పపీడనాల కారణంగా ఇంకా జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీటి మట్టం ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఖరీఫ్(వానాకాలం) సీజన్‌లో కురిసిన వర్షాలకు పంటలు కళకళలాడుతున్నాయి. వచ్చే యాసంగి(రబీ) సీజన్‌కు కూడా నీటి ఎద్దడి ఉండదని రైతులు భావిస్తున్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు కూడా తొలగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

- జిల్లాలో విస్తారంగా వర్షాలు.. 99శాతం బోర్లలో నీళ్లు
- సగటు 6.31 మీటర్లకు చేరిన భూగర్భజలాలు
- 12 మండలాల్లో 5 మీటర్లలోపే ...
- భారీ వర్షాలతో నిండిన చెరువులు, కుంటలు
- ఒక్క నెలలో 1.12 మీటర్ల భూగర్భజలాలు పెరుగుదల
- వచ్చే యాసంగి సాగుకి డోకా లేనట్లే..

కరువు తీరా..!

పైపైకి పాతాళగంగ

జిల్లాలో గత మూడునెలలుగా భూగర్భజలాల సగటు (మీటర్లలో)

నెల	సగటు
జూన్	13.09
జూలై	11.74
ఆగస్టు	7.43
సెప్టెంబరు	6.31

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): కొన్నేళ్ల తరువాత జిల్లాలో దండిగా భూగర్భజలాలు పెరిగాయి. గత మూడునెలలుగా విస్తారంగా వర్షాలు కురవడంతో జిల్లా వ్యాప్తంగా చెరువులు, కుంటలు నిండాయి. వాగులు, వంకలు పరవళ్లు తొక్కుతున్నాయి. దీంతో జిల్లాలో అన్ని ప్రాంతాల్లో భూగర్భజలాలు గతంలో ఎన్నడూ లేని విధంగా పెరిగాయి. ఎక్కడ చూసినా పాతళగంగ పైకి ఉబికి వస్తోంది. సెప్టెంబర్ నెలాఖరు నాటికి జిల్లాలో సగటు భూగర్భజలాలు 6.31 మీటర్లకు చేరాయి. తాజాగా భూగర్భ జలశాఖ నివేదికలో గత మే నెలతో పోలిస్తే సెప్టెంబర్ నెలాఖరు నాటికి 99శాతం బోర్లలో నీటి నిల్వలు గణనీయంగా పెరిగాయి. జిల్లా వ్యాప్తంగా గత వేసవితో పోలిస్తే సగటు 8.77 మీటర్లు భూగర్భజలాలు పెరిగాయి. అత్యధికంగా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్‌లో 51.99 మీటర్లు పెరగడం గమనార్హం. గత ఏడాది సెప్టెంబర్‌తో పోలిస్తే జిల్లా వ్యాప్తంగా సగటు 1.94 మీటర్ల భూగర్భజలాలు పెరిగాయి. గత ఏడాది సెప్టెంబర్‌లో భూగర్భజలాలు 8.25మీటర్లు ఉండగా,



మిగతా 8వ పేజీలో...

జిల్లాలో అనేక మండలాల్లో ఈ ఏడాది భూగర్భజలాలు భారీగా పెరిగాయి. దీంతో అనేకచోట్ల బోర్లు, బావుల్లో దండిగా నీళ్లు ఉన్నాయి. నందిగామ మండలంలో కేవలం 1.72 మీటర్ల లోతులోనే భూగర్భజలాలు ఉండడం గమనార్హం. అలాగే అబ్దుల్లాపూర్‌మెట్‌లో 2.22 మీటర్లు, ఆమనగ

ఇక్కడ ఇలా..

ల్‌లో 3.28 మీటర్లు, కందుకూరులో 3.50 మీటర్లు, బాలాపూర్‌లో 3.67 మీటర్లు, చేవెళ్లలో 3.65 మీటర్లు, మొయినాబాద్‌లో 3.75 మీటర్లకు భూగర్భజలాలు చేరుకున్నాయి. ఇక షాబాద్ 4 మీటర్లు, కొందుర్గు 4.12 మీటర్లు, కేశంపేట 4.31 మీటర్లు, శంషాబాద్ 4.90 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉన్నాయి.



బస్టాండ్‌లో నోరుతెరిచిన మ్యాన్‌హోల్

శంషాబాద్ బస్టాండ్‌లో ప్రమాదకరంగా మ్యాన్‌హోల్ నోరు తెరుచుకొని ఉంది. దానిపై ఉన్న మూత ధ్వంసం కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం ఈ బస్టాండ్‌కు వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌పై మూత ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా



విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్, పక్కన గురుకుల ప్రిన్సిపాల్ ప్రీతి

విద్యార్థి ఫినాయిల్ తాగడంపై విచారణ

- కేశంపేట గురుకులాన్ని సందర్శించిన ఇన్‌చార్జి ఎంఈవో
- విద్యార్థులతో మాట్లాడి వివరాల సేకరణ
- చదువు ఇష్టం లేకనే తాగినట్లు వెల్లడి

కేశంపేట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కేశంపేట మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను శుక్రవారం కేశంపేట మండల ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్ సందర్శించారు. పాఠశాలకు చెందిన విద్యార్థి హర్షవర్ధన్ ఫినాయిల్ తాగడానికి గల కారణాలపై ఆరా తీశారు. విద్యార్థికి హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేదని, గతంలో రెండు పర్యాయాలు ఇక్కడి నుంచి పారిపోయినట్లు తెలుసుకున్నారు. తల్లితండ్రుల బలవంతం మీద హాస్టల్‌లో ఉంటున్నాడని, అతనికి చదువుపై ఇష్టం లేదని, ఇంటికి పంపిస్తారనే ఫినాయిల్ తాగాడని విద్యార్థులు ఎంఈవోకు వివరించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ ప్రీతితో కలిసి కిచెన్, డార్మెంటరీని పరిశీలించారు. విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని ఎంఈవో సూచించారు. తల్లితండ్రుల నమ్మకాన్ని వమ్ముచేయవద్దని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే ఉపాధ్యాయుల ద్వారా ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. కానీ ఇలాంటి పనులు చేస్తే గురుకులానికి చెడ్డపేరు వస్తుందని తెలిపారు.

నాణ్యమైన విత్తనంతో అధిక దిగుబడి



ముకునూరులో వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఇబ్రహీంపట్నం/యాచారం అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనాలు వాడినపుడు 10-15 శాతం అధిక దిగుబడులు వస్తాయని రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు తెలిపారు. ఏ పంటకైనా సస్యరక్షణ చర్యలు చేపట్టడం చాలా ముఖ్యమని వారు వివరించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇబ్రహీంపట్నం మండలం ముకునూరు, యాచారం మండలం గున్‌గల్, చౌదర్‌పల్లి, తక్కళ్లపల్లి తండా, మొగుల్లవంపు గ్రామాల్లో వరి, పత్తి, కంది, కూరగాయ పంటలను వారు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఆయా గ్రామాల్లో ఫౌండేషన్ విత్తనం కేఎన్ఎం 1638 వరి రకాన్ని సాగు చేసిన పొలాలను సందర్శించారు. వరి పొట్ట దశలో ఉన్నందున యూరియా వాడొద్దని, అలా చేస్తే గింజ తాలు పోతుందన్నారు. కలుపు, బెరుకు లేని ధాన్యం సేకరించి యాసంగికి విత్తనంగా వాడుకోవచ్చని శాస్త్రవేత్తలు సూచించారు. మెట్ట పంటలో డ్రిప్ ద్వారా నీరందిస్తున్న రైతులు దుక్కిలో 28-28-0 కాంప్లెక్స్ ఎరువు వాడుతున్నామని, పలు దఫాలలో యూరియా పైపాటుగా వేస్తున్నామని చెప్పారు. ప్రతి రెండు పంటలకు జింకు, పొటాష్ వాడుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు. వర్షాలకు ఆలస్యంగా నాటిన వరిలో ఆకు ముడత, అక్కడక్కడ కంకినల్లి ఆశిస్తుందని నివారణలో భాగంగా ఎసిఫేట్ 2.5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డా.రజినీకాంత్, డా.అరుణశ్రీ, డా.నర్సయ్య, డా.రామకృష్ణబాబు, డా.కిరణ్, డా.శ్రీనివాస్, డా.ఆంజనేయులు, డా. కృష్ణవేణి, మండల వ్యవసాయాధికారులు విద్యాధరి, రవినాథ్, ఏఈవో సృజన, ముకునూరు పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్‌లు పాల్గొన్నారు.



ఉద్యాన సాగుపై ఆసక్తి పెంచుకోవాలి

కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు

6



రిజర్వేషన్ల సాధనకు ఐక్యంగా పోరాడాలి

- బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు

7

ఆటలకు ఆటంకం

- ఆమనగల్లులో క్రీడాకారుల ఇబ్బందులు
- ప్రతిపాదనలకే పరిమితం
- ఆటగాళ్లలో ప్రతిభ ఉన్నా శిక్షణ కరువు
- అమలుకు నోచని నేతల హామీలు

కలగానే మినీ స్టేడియం నిర్మాణం

ఆమనగల్లు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రతి మండల కేంద్రంలో మినీ స్టేడియాలు నిర్మిస్తామన్న ప్రభుత్వ, పాలక ప్రజాప్రతినిధుల హామీలు అమలుకు నోచుకోవడం లేదు. దీంతో క్రీడాకారులు, విద్యార్థులు తీవ్ర నిరుత్సాహానికి లోనవుతున్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉండి విద్యాపరంగా అభివృద్ధి చెందిన ఆమనగల్లు పట్టణంలో మినీస్టేడియం నిర్మాణం కలగానే మిగిలిపోతుంది. నేతల హామీలకే పరిమితమవుతుంది. ఆమనగల్లు పట్టణం రాష్ట్ర రాజధానికి చేరువలో ఉండి నాలుగు మండలాలకు కూడలిగా ఉంది. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, వెల్దండ, కడ్తాల మండలాల పరిధిలోని సుమారు 5వేల మంది విద్యార్థులు ఆమనగల్లులో వివిధ పాఠశాలలు, కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. ఎంతోమంది జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడాకారులు ఉన్నారు. పాఠశాలల్లో చదువుతున్న

మిగతా 8వ పేజీలో...



ఇరుకైన స్థలంలో క్రీడల నిర్వహణ (ఫైల్)



స్టేడియం ఏర్పాటు చేయాలి

ప్రతి మండల కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటు చేసి క్రీడల్లో ప్రతిభ ఉన్న విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందించాలి. ఆ దిశగా ప్రభుత్వం, పాలక ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలి. ఐదు మండలాలకు కూడలిగా ఉన్న ఆమనగల్లు పట్టణంలో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలి. స్థానికంగా కళాశాలలు, పాఠశాలల్లో సరైన మైదానాలు లేవు. స్టేడియం ఏర్పాటు చేస్తే క్రీడాపోటీల నిర్వహణకు, శిక్షణకు దోహద పడుతుంది. ప్రతిభ ఉన్న ఎంతోమంది క్రీడాకారులు ప్రోత్సాహం లేక, శిక్షణ కరువై ఆటల్లో రాణించలేకపోతున్నారు.

- వీరబొమ్మ రామ్మోహన్, ఆమనగల్లు



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండైన అంతనోవ్ 124 కార్గో విమానం

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భారీ కార్గో విమానం ల్యాండింగ్

శంషాబాద్ రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలోనే అతిపెద్ద కార్గో విమానాల్లో ఒకటైన ఆంతనోవ్ ఏఎన్- 124 కార్గో విమానం శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండైంది. ఈ విమానం రష్యా నుంచి కొన్ని సరుకులను తీసుకుని శంషాబాద్ ఎయిర్‌పోర్టు కార్గోకు వచ్చింది. గతంలో బెలూగ కార్గో విమా నం ల్యాండ్ కాగా, ఇప్పుడు అంతనోవ్ ఏఎన్ - 124 రెండవ విమానం. అతిపెద్ద కార్గో విమానం రాక సందర్భంగా జీఎంఆర్ అధికారులు పైలెట్లకు ఘన స్వాగతం పలికారు. పెద్ద కార్గో విమానాలు ల్యాండింగ్, టేకాఫ్ కావడానికి సరిపడా రన్‌వే శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉందని జీఎంఆర్ అధికారులు తెలిపారు. ఎయిర్‌పోర్టులో ఉన్న సౌకర్యాలపై పైలెట్లు సంతృప్తి వ్యక్తం చేశారు. విమానం తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు టేకాఫ్ తీసుకుని వెళ్లినట్లు అధికారులు తెలిపారు.

షాద్‌నగర్ బల్దియాకు రూ.10 కోట్లు

- పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పర్చాలి
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి పర్చాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ షాద్‌నగర్ మున్సిపాలిటీకి హెచ్ఎండీఏ ద్వారా రూ.10కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో పట్టణంలో కొత్తగా వెలిసిన కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలన్నారు. పనుల పురోగతిని బట్టి దశల వారీగా నిధులు విడుదల చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ పరిధిలోని ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. కమిషనర్ సునీత మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని, నిధుల మంజూరుతో తమ శక్తివంచన లేకుండా ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు.



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

అనుమతుల్లేని క్లినిక్‌ల సీజ్

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి /కందుకూరు, అక్టోబరు 10 : జాతీయ మెడికల్ కౌన్సిల్ ఆదేశానుసారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అనుమతుల్లేని క్లినిక్‌లపై ఉక్కుపాదం మోపారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అనుమతుల్లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తున్న ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. అందులో కిస్మత్‌పురలోని భవానీ క్లినిక్ నిర్వాహకుడు రమేశ్, సరిత ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌కు చెందిన సరిత గౌడ్, హోప్ పాలీ క్లినిక్‌కు చెందిన జ్యోతి, కందుకూరు మండల కేంద్రంలోని లలిత క్లినిక్‌కు చెందిన వెంకటయ్యపై కేసు నమోదు చేశారు. అలాగే మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా పరిధిలోని కీసరలో సుజాత మెడికల్ అండ్ జనరల్ స్టోర్ నిర్వాహకుడు కోట రాంబాబు, భాస్కర ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌కు చెందిన భాస్కర్, మణికంఠ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌కు చెందిన కృష్ణ, లైఫ్ సేవ్ మెడికల్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ బండ్లగూడ(కీసర)కు చెందిన వారిపై కేసు నమోదు చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ వైద్యుల చికిత్స కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. తప్పుడు మందుల వాడకం వల్ల ప్రాణానికి హాని కలిగే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట మెడికల్ కౌన్సిల్ మెంబరు డాక్టర్ ఇమ్రాన్‌అలీ పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో ఆగనున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లు

- ఫలించిన ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కృషి
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు, బీజేపీ నాయకులు

శంకర్‌పల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : శంకర్‌పల్లి రైల్వే ప్రయాణికుల కోసం త్వరలోనే రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగనున్నాయని బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం శంకర్‌పల్లిలో ఆయన మాట్లాడుతూ.. శంకర్‌పల్లి రైల్వే స్టేషన్‌లో నాందేడ్- రాయచూర్- పర్బని, హైదరాబాద్ - విజయపుర తదితర రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఇటీవల దక్షిణ మధ్య రైల్వే మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ్‌ను కలిసి వినతి ప్రతం అందించారని చెప్పారు. అయితే ఎంపీ చేసిన వినతికి రైల్వే అధికారులు స్పందించి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపేందుకు ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. రైల్వేస్టేషన్‌ను సైతం ఆధునికీకరణ చేయనున్నారని పేర్కొన్నారు. శంకర్‌పల్లి మండల ప్రజల తరఫున ఎంపీకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు.

వరదలో ఇరుక్కుపోయిన అంబులెన్స్



కోకట్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీటిలో అంబులెన్స్

యాలాల, అక్టోబర్ 10, (ఆంధ్రజ్యోతి): రైల్వే అండర్ బ్రిడ్జీ నీటిలో అంబులెన్స్ ఇరుక్కుపోయింది. శుక్రవారం కోకట్ నుంచి రాజీవ్ కాలనీ వైపు వెళ్తున్న అంబులెన్స్ మార్గమధ్యలోని రైల్వే అండర్ బ్రిడ్జీ నీటిలో ఆగిపోయింది. అంబులెన్స్‌లో ఎవరూ అంబులెన్స్‌లో ఉన్న సిస్టర్స్ డ్రైవర్ క్షేమంగా బయటపడ్డారు. డ్రైవర్‌కు ఈ రోడ్డు మార్గంలో అంతగా అవగాహన లేకపోవడంతో నీటి శాతం కొద్దిగా ఉందని భావించి అందులో నుంచి వెళ్లేందుకు ప్రయత్నించినట్లు పలువురువు చెప్పారు.


వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బాధితులకు రూ.25 కోట్లు ఇవ్వాలి

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తాండూరు శివారులో బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారంగా రూ.25 కోట్లతో జీవో మంజూరు చేయాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ముఖ్య కార్యదర్శి త్వరలో జీవో జారీ చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ ఉన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి చామల రఘుపతిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న చామల రఘుపతిరెడ్డి

వికారాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సోషల్ మీడియా కో ఆర్డినేటర్లు కీలక పాత్ర వహించాలని టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి చామల రఘుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్ పట్టణంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలోకి రావడంలో సోషల్ మీడియా పాత్ర కీలకమని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత సైతం ఉందన్నారు. సోషల్ మీడియా ద్వారా పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని, త్వరలో స్పీకర్‌తో సమావేశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ మీడియా ఇన్‌చార్జి శ్రీనివాస్ ముదిరాజ్, సిద్దులూరు యాదగిరి, విజయ్‌కుమార్, నరేందర్, రోహిత్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల ఓపీ డ్యూటీలు రద్దు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న ఆశావర్కర్లు, సీఐటీయూ నాయకులు

ధారూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఓపీ డ్యూటీలు రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని ఆశా వర్కర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ధారూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ జీపీఎస్ ఆఫ్ విధానం రద్దు చేయాలని, అదనపు పని విధానం తొలగించాలని, ఆసుపత్రిలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. అలాగే స్వీపర్స్, డాటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించాలని, ధారూరు సబ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, 24 గంటలపాటు డాక్టర్స్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సంవత్సరానికి మూడు జతల నాణ్యమైన యూనిఫారమ్స్ ఇవ్వాలని, పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సీఐటీయూ నాయకులు సుదర్శన్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకున్న పార్థసారథి

సెర్చ్ స్వచ్ఛంద సంస్థకు అవార్డు

కందుకూరు, అక్టోబరు 10 (ఆధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలో అమెజాన్ కంపెనీ సౌజన్యంతో పలు కార్యక్రమాలను చేపట్టిన సెర్చ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సీఆర్ఎస్ బాక్స్(డూయింగ్ గుడ్ భారత్) అవార్డు అందుకున్నారు. గురువారం రాత్రి ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పార్లమెంటరీ వ్యవహారాల రాష్ట్ర మంత్రి(భారత ప్రభుత్వం) మురగన్ చేతుల మీదుగా సంస్థ ప్రతినిధి పార్థసారధి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలో కందుకూరు, షాబాద్ మండలాల్లో జల వనరులను పునరుద్ధరించడంలో విశేష కృషి చేసినట్లు తెలిపారు. పర్యావరణ సంరక్షణకు తమ సంస్థకు మద్దతునిచ్చిన అమెజాన్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. తమ సంస్థ సుస్థిర జల నిర్వాహణ, వాతావరణం, సమాజాభివృద్ధికి పాటుపడుతుందన్నారు. అమెజాన్ సంస్థ సౌజన్యంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను గుర్తించి సీఆర్ఎస్ బాక్స్(డూయింగ్ గుడ్ ఫర్ భారత్) 2025 అవార్డుకు ఎంపిక చేయడంపై వ్యక్తం చేశారు.


పలుగుట్టలో రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

ఉద్యాన సాగుపై ఆసక్తి పెంచుకోవాలి

చేవెళ్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు ఉద్యాన పంటల సాగుపై ఆసక్తి పెంచుకోవాలని కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు అన్నారు. శుక్రవారం చేవెళ్ల మండలంలోని పలుగుట్ట గ్రామంలో రైతులు సాగు చేస్తున్న కూరగాయల పంటలతోపాటు పూల సాగును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు హార్టికల్చర్ సమగ్రాభివృద్ధి మిషన్‌తో కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ పథకం ద్వారా రైతులకు ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తుందన్నారు. పండ్లు, కూరగాయలు, పూలు, ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్యాలు, తోట వృక్షాలు మొదలైన వాటి ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్ అభివృద్ధి చేయడం ఈ పథకం ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు వినూత్న, హర్షిత, ప్రేసి, కీర్తన, శివాణి, మేఘన, మానస, భావన, తదితరులు ఉన్నారు.

ఘనంగా కలెక్టర్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ జన్మదిన వేడుకలను కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్ జిల్లా అధికారుల సమక్షంలో కలెక్టర్‌తో కేక్ కట్ చేయించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో మంగిలాల్, డీఆర్‌డీఏ శ్రీనివాస్, ఆర్డీవో వాసుచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన


పూజల్లో భట్టు కిషన్‌రెడ్డిఅనురాధ దంపతులు

ఆమనగల్లు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మాడ్గుల మండలం రాజీవ్‌నగర్ తండాలో నూతనంగా నిర్మించిన శ్రీ తుల్జాభవాని ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు నిర్వహించే వేడుకలకు ఆలయాన్ని అందంగా అలంకరించారు. ఆమనగల్లు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి, కొల్కులపల్లి మాజీ సర్పంచ్ భట్టు అనురాధ ఆధ్వర్యంలో ఆలయాన్ని నిర్మించారు. విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా తొలి రోజు గణపతిపూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాదన, అగ్నిప్రతిష్ఠ, వాస్తు హోమం, జలాది వాసం, మంత్ర పుష్పం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు, తండా వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఆర్గానిక్ విల్లాస్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి


అంతారం గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన తీసిన గుంత

చేవెళ్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్గానిక్ విల్లాస్ ప్రాజెక్టు నిర్వాహకులు ఇష్టారాజ్యంగా రోడ్లను ధ్వంసం చేస్తూ తరుచు ప్రజలను, వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని చేవెళ్ల మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరేందర్, అంతారం సీనియర్ నాయకుడు సుధాకర్, పలువురు గ్రామస్తులు ఆరోపించారు. శుక్రవారం వారు స్థానికంగా మాట్లాడుతూ.. చేవెళ్ల మండలంలోని అంతారం గ్రామం పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న ఆర్గానిక్ విల్లాస్ ప్రాజెక్టు నిర్వాహకులు గ్రామానికి వెళ్లే రోడ్డు వెంబడి రాత్రి సమయంలో ప్రత్యేకంగా అండర్ కేబుల్ లైన్ కోసం జేసీబీ సహాయంతో గుంతలు తీసే పనులు చేస్తున్నారన్నారు. ఇది గమనించకుండా అంతారం గ్రామానికి బైక్‌పై వస్తున్న ప్రభాకర్ గురువారం రాత్రి ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి గుంతలో పడడంతో కాళ్లు విరిగి నగరంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. ఆర్గానిక్ విల్లాస్ నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే కొద్ది రోజులుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. గురువారం రాత్రి సమయంలో తీసిన గుంతల పనులను గ్రామస్తులతో కలిసి అడ్డుకున్నట్లు చెప్పారు. గుంతలు ఎందుకు తీస్తున్నారని ప్రశ్నిస్తే హెచ్ఎండీఏ నుంచి అనుమతులు తీసుకున్నామని విల్లాస్ నిర్వాహకులు బెదిరిస్తున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆర్గానిక్ విల్లాస్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలి


కొడంగల్ రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రైతులు పంట పొలాల్లో విధిగా లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలని మండల వ్యవసాయ అధికారి తులసి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఉడిమేశ్వరంలో పత్తి, కంది, వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. సాగులో రసాయన ఎవరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి ఐసాక్ హెరాల్డ్ రైతులు కె.శ్రీనివాస్, మోహన్, మోహన్ రెడ్డి, రాములు, శ్రీకాంత్ ఉన్నారు.
















ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న ముస్లిం నాయకులు

ఎమ్మెల్యే రాజాసింగ్‌పై ఫిర్యాదు

ధారూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మహ్మద్ ప్రవక్తపై చేసిన వ్యాఖ్యలు ముస్లింలను అవమానించేలా ఉన్నాయని, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం ఎస్ఐ రాఘవేందర్‌కు ధారూరు ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే రాజాసింగ్ మధ్యప్రదేశ్ రాష్ట్రంలో బహిరంగ సభలో మహ్మద్ ప్రవక్తపై చేసిన వ్యాఖ్యలు మత పరమైన విద్వేశాలను రెచ్చగొట్టేలా ఉన్నాయన్నారు. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా ఎమ్మెల్యే రాజాసింగ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో జామా మసీదు కమిటీ అధ్యక్షుడు ఉమ్మర్, ఎంఐఎం నాయకుడు మోహిజ్ ఖురేషి ఉన్నారు.

తపాలా ఉద్యోగులకు సన్మానం


పోస్టల్ ఉద్యోగులను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జాతీయ తపాల దినోత్సవం సందర్భంగా శుక్రవారం పోచారం మున్సిపాలిటీ, కొర్రెముల సుప్రభాత్‌టౌన్‌షిప్‌లో పోస్టల్ ఉద్యోగులను సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి అళవందార్ వేణుమాదవ్ మాట్లాడుతూ.. 150 సంవత్సరాల నుంచి పోస్టల్‌శాఖ ఎన్నో ఆటుపోట్లను తట్టుకొని ముందుకు సాగుతుందన్నారు. లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పిస్తూ ప్రజలకు ఉత్తరాలు చేరవేయడమే కాకుండా పొదుపు, బీమా సౌకర్యాలు కల్పిస్తుందని తెలిపారు. కొర్రెములలో పోస్టాఫీసులో పనిచేస్తున్న నందకిషోర్, జితేందర్, సౌజన్యను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధికి రూ.కోటి మంజూరు


పార్కును పరిశీలిస్తున్న కాంగ్రెస్ మేడ్చల్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి


మేడ్చల్ టౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్‌జీఆర్, కేఎల్ఆర్ ఫేస్ టూలోని ఎకరం స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేయడానికి రూ. కోటి మంజూరు చేయటం అభినందనీయమని కాంగ్రెస్ మేడ్చల్ పట్టణ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక నాయకులతో కలిసి పార్కు స్థలాన్ని పరిశీలించారు. ఎన్‌జీఆర్‌కే ఎల్ఆర్ ఫేస్ టూలోని ఎకరం పార్కు స్థలంలో వాకింగ్ ట్రాక్, జిమ్‌ను ఏర్పాటు చేయటానికి హెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారులకు చేసిన ఫిర్యాదుపై స్పందించి రూ.కోటి మంజూరు చేశారన్నారు. పార్కును త్వరగా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి


ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం ఇస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

బషీరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ఔట్ సోర్సింగ్ సిబ్బంది శుక్రవారం బషీరాబాద్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అనీల్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా వ్యాప్తంగా తొమ్మిది మోడల్ స్కూళ్లలో ఔట్ సోర్సింగ్ కింద 39 మంది కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లు, వాచ్‌మెన్‌లు పని చేస్తున్నారని తెలిపారు. ఎనిమిది నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబాలను పోషించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఈ విషయమై జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

శామీర్‌పేట పెద్ద చెరువు పరిశీలన


శామీర్‌పేట పెద్ద చెరువును పరిశీలిస్తున్న సభ్యులు

శామీర్‌పేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ రోయింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు శామీర్‌పేట పెద్ద చెరువులో నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలో రోయింగ్ ఫెడరేషన్ టెక్నికల్ బృందం, స్పోర్ట్స్ అథారిటీ అధికారులు శామిర్‌పేట పెద్దచెరువును సందర్శించారు. క్రీడల నిర్వహణకు సాధ్యాసాధ్యాలపై సమీక్షించారు. విస్తీర్ణం, లోతు తదితర అంశాల వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో వీసీ అండ్ ఎండ స్పోర్ట్స్ అథారిటీ తెలంగాణ, శామిర్‌పేట తహసీల్దార్, ఇరిగేషన్ అధికారులు, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కీసర ఆర్ఐ రమేశ్ బదిలీ

కీసర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కీసర తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహించే ఆర్ఐ రమేశ్ బదిలీ అయ్యారు. అతని స్థానంలో బాచుపల్లిలో విధులు నిర్వహించిన మహేందర్ కీసరకు వచ్చారు. గత కొంత కాలంగా కీసరలో ఆర్ఐగా విధులు నిర్వహించిన రమేష్ హఠాత్తుగా గురువారం రాత్రి ఉత్తర్వులు రావడం, శుక్రవారం మాల్కాజ్‌గిరి ఆర్డీవో కార్యాలయంలో రిపోర్ట్ చేయడం, మహేందర్ కీసరలో చార్జ్ తీసుకోవడం తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం పెద్ద చర్చనీయాంశంగా మారింది.

ప్రగతి నిరోధకంగా విపక్షాలు


పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే నారాయణ రెడ్డి

» ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజా విశ్వాసం కోల్పోయి అధికారానికి దూరమైన బీఆర్ఎస్ నాయకులు ఉనికి కోసం కుట్ర రాజకీయాలు సాగిస్తూ రాష్ట్రంలో ప్రగతి నిరోధకంగా మారారని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఆరోపించారు. కడ్తాల మండలం ముద్విన్ గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన నాయకులకు టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మార్కెట్ వైస్ ఛైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యనాయక్‌కు కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే పార్లమెంట్‌లో బీజేపీ ప్రభుత్వం ఆమోదించకుండా అడ్డుపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్య నాయక్, ముద్విన్ మాజీ సర్పంచ్ రామచంద రయ్య, నాయకులు నక్కపోతు నర్సింహ, సురేందర్‌రెడ్డి, రమేశ్, నర్సింహ, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల సాధనకు ఐక్యంగా పోరాడాలి


కడ్తాలలో నిరసన తెలుపుతున్న బీసీ సంఘం నాయకులు

» బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు

కడ్తాల్/చౌదరిగూడ/మంచాల/తాండూరు/పరిగి/మేడ్చల్ టౌన్/షాబాద్: అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిరసనాలు తెలిపారు. కడ్తాల మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు పిప్పళ్ల వెంకటేశ్ ఆధ్వర్యంలో మహాత్మజ్యోతిబా పూలే విగ్రహం వద్ద వివిధ పార్టీల నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ దశరథ్ నాయక్, మాజీ ఉప సర్పంచ్ కడారి రామకృష్ణ, నాయకులు గురిగళ్ల లక్ష్మయ్య, జహంగీర్‌అలీ, సత్యం యాదవ్, రవి, మంగళపల్లి నర్సింహ, రాజేశ్, రాంచందర్ నాయక్, శేఖర్, లాయక్‌అలీ, తదితరులున్నారు.

42 శాతం రిజర్వేషన్ల కోసం పోరాడుదాం

బీసీలు హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని బీసీ సేన రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి జయ శ్రీకాంత్ అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధినించిన నేపథ్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో అఖిల భారత విద్యార్థి విభాగం రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాశ్, బీసీ సేన మండలాధ్యక్షుడు చెన్నయ్య, నాయకులు శ్రీకాంత్, వెంకటేష్, దామోదర్, అనిత, సాగర్, మల్లేష్, లావణ్య, జంగయ్య, లక్ష్మి, బాలమణి, శ్రీను పాల్గొన్నారు.

బీసీలకు న్యాయం చేయాలి

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు వచ్చే వరకూ పోరాడుతామని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. షాబాద్‌లో కంది - షాద్‌నగర్ జాతీయ రహదారిపై ధర్నా చేసి తహసీల్దార్‌కు వినతిప్రతం అందజేశారు. కార్యక్రమంలో బీసీ సేన మండలాధ్యక్షుడు దయాకర్ చారి, ఉపాధ్యక్షుడు బాల్‌రాజ్, యూత్ అధ్యక్షుడు అజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ వెంకట్ యాదవ్, మాజీ ఎంపీటీసీ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు అమలుచేయాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ మంచాల మండల కేంద్రంలో వివిధ పార్టీలకు చెందిన నేతలు ప్లకార్డులు పట్టుకుని రాస్తారోకో చేశారు. ఆందోళనలో కంభాలపల్లి భాస్కర్, అశ్వాల బాల్‌రాజ్, చిందం శ్రీశైలం, వంగాల కృష్ణ, మొగిలి మహేష్, పసుల కృష్ణ, గజ్జి అయలయ్య, శివరాల పాండు, సత్తయ్య, మంకు వినోద్, గడ్డం రాజేష్, చంద్రయ్య, కుర్రరాజు, గ్యార పాండు, మల్ల లింగం, మొగిలి శ్రీశైలం పాల్గొన్నారు.

ఇది అగ్రవర్ణాల కుట్ర

బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవడం హైకోర్టులో స్టే ఇవ్వడం వెనుక అగ్రవర్ణాల కుట్ర దాగి ఉందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్ అన్నారు. హైకోర్టు స్టేకు నిరసనగా తాండూరు అంబేద్కర్ చౌక్‌లో నిర్వహించిన బీసీల ధర్నాలో పాల్గొన్నారు. బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి సయ్యద్‌సుకూర్, గడ్డం వెంకటేష్, అనిత, మంజుల, విజయలక్ష్మి, శివలిలా ఉన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ కుట్రతోనే..

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషనల్ల ఆంశం బీజేపీ, బీఆర్ఎస్ కుట్రతోనే నిలిచిపోయాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.లాల్‌కృష్ణప్రసాద్, కార్యదర్శి కె.హన్మంత్‌ముదిరాజ్ ఆరోపించారు. బీసీ సంఘాల ఆధ్వర్యంలో పరిగిలో నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మాజీ వైఎస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, నాయకులు శ్రీనివాస్, నర్సింహులు, గోపాల్ పాల్గొన్నారు.

జేఏసీ ఆధ్వర్యంలో...

టీ-జేఏసీ జిల్లా కన్వీనర్ ఎం.నాగేశ్వర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా కన్వీనర్ నాగేశ్వర్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్ మాట్లాడుతూ.. జనాభా ప్రతిపాధికన రిజర్వేషన్లు బీసీల హక్కు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరేందర్, గోవింద్ నాయక్, ఎరన్‌పల్లి శ్రీనివాస్, దోమ శ్రీశైలం, పి.బాబయ్య పాల్గొన్నారు.

స్టే దురదుష్టకరం

బహుజన సమాజాన్ని అణిచివేసే కుట్రలో భాగంగా బీసీ రిజర్వేషన్లు అమలు కాకుండా అడ్డు పడుతున్నారని బీసీ సేవ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు అరుణ్‌యాదవ్ ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై స్టే రావటాన్ని నిరసిస్తూ బీసీ విద్యార్థులతో కలిసి మేడ్చల్‌లో రాస్తరోకో చేశారు. హైకోర్టు రిజర్వేషన్ల పట్ల స్టే ఇవ్వటం దురదృష్ట కరమన్నారు.


చౌదరిగూడలో బీసీ రిజర్వేషన్లపై ధర్నా చేపట్టిన బీసీ సేన నాయకులు


తాండూరు: అంబేద్కర్ చౌక్‌లో ధర్నా చేస్తున్న బీసీ సంఘం నాయకులు


మేడ్చల్ టౌన్: రాస్తారోకో చేస్తున్న బీసీ విద్యార్థి సంఘాల నాయకులు

ఇది ప్రభుత్వ వైఫల్యమే..

బీసీ నేత బీఆర్ఎస్ కృష్ణ ముదిరాజ్



వికారాబాద్: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి అన్ని అవకాశాలు ఉన్నా జీవో నంబర్ 9పై హై కోర్టులో స్టే ఇవ్వడం ప్రభుత్వ వైఫల్యమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.ఆర్.కృష్ణ ముదిరాజ్ అన్నారు. రెండేళ్లుగా కొలిక్కిరాక బీసీల రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. గ్రామాల్లో సర్పంచ్‌లు లేక అభివృద్ధి కుంటుపడిపోతోందన్నారు. ఈ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చినప్పుడే రాజ్యాంగ భద్రత వస్తుందన్నారు.

వచ్చే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ

» బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానందరెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానందరెడ్డి

వికారాబాద్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాలకు పోటీ చేస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానందరెడ్డి తెలిపారు. శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు శివరాజ్ గౌడ్ అధ్యక్షతన పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. బీజేపీ గతంలో కంటే ఇప్పుడు చాలా బపడిందన్నారు. చేవెళ్ల పార్లమెంట్ స్థానం గెలిచినట్లు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ ఫలాలు సామాన్యులకు అందుతున్నాయని తెలిపారు. హైకోర్టు స్టే ముగిసిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు లేక అభివృద్ధి కుంటుపడుతుందని ఆరోపించారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల కోకన్వీనర్ అమరేందర్ రెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్, ఉపాధ్యక్షులు సురేందర్, సూర్యప్రకాశ్, రఘు, మోహన్ రెడ్డి, గొడుగు సుధాకర్, శ్రీకాంత్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

వారంపాటు 32 రైళ్లు రద్దు

» వందేభారత్, కృష్ణా ఎక్స్‌ప్రెస్ రీషెడ్యూల్

» గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఖాజీపేట వరకే..

» డోర్నకల్ సెక్షన్‌లో ట్రాక్ మరమ్మతులు



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): డోర్నకల్-పాపటపల్లి మధ్య మూడోలైన్ మరమ్మతు పనుల కారణంగా దక్షిణ మధ్య రైల్వే 32 రైళ్లను వారం పాటు రద్దు చేసింది. మరికొన్నింటిని రీషెడ్యూల్ చేసింది. ఈ మార్పులు ఈ నెల 11 నుంచి 18 వరకు ఉంటాయని రైల్వే అధికారులు తెలిపారు. రద్దయిన రైళ్లలో ప్రధానంగా డోర్నకల్-ఖాజీపేట్, విజయవాడ -డోర్నకల్ మెమో ప్యాసింజర్లు, సికింద్రాబాద్-గుంటూరు ఇంటర్‌సిటీ, విశాఖపట్నం-న్యూఢిల్లీ స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్, ఏపీ ఎక్స్‌ప్రెస్, పూరి-ఓకా ద్వారకా ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లు ఉన్నాయి. అలాగే, ఆదిలాబాద్-తిరుపతి మధ్య నడిచే కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13, 16, 17 తేదీల్లో గంటన్నర ఆలస్యంగా రీషెడ్యూల్ అయింది. విశాఖపట్నం-సికింద్రాబాద్ వందేభారత్, సికింద్రాబాద్-విశాఖపట్నం వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లు ఈ నెల 15, 16, 18 తేదీల్లో గంటన్నర ఆలస్యంగా బయల్దేరనున్నాయి. సికింద్రాబాద్-గుంటూరు మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను 14 నుంచి 18 వరకు ఖాజీపేట్-గుంటూరు మధ్య పాక్షికంగా రద్దయింది. అంటే, ఈ రైలు సికింద్రాబాద్ నుంచి ఖాజీపేట వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఖాజీపేట నుంచి బయల్దేరుతుంది.


శబరి ఎక్స్‌ప్రెస్‌లో కోచ్ మార్పు

సికింద్రాబాద్ నుంచి త్రివేండ్రానికి శనివారం బయల్దేరనున్న శబరి (20629) ఎక్స్‌ప్రెస్‌లో ఫస్ట్ ఏసీ కోచ్‌కు బదులుగా అదనంగా సెకండ్ ఏసీ కోచ్‌ను జతసినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. ఫస్ట్ ఏసీ బోగీలో మెకానికల్ సమస్యలు తలెత్తడంతో దాని స్థానంలో కోచ్‌మార్పు అనివార్యమైందని పేర్కొన్నారు. ఫస్ట్ ఏసీలో రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు సెకండ్ ఏసీలో బెర్తులు కేటాయించనున్నారు.

సేవా దృక్పథంతో మెలగాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ కృష్ణయ్య

మేడ్చల్ టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగాన్ని చేపట్టే ప్రతిఒక్కరూ సేవా దృక్పథంతో ఉండాలని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి సీఈఓ కృష్ణయ్య అన్నారు. మండలంలోని ఘనాపూర్ మెడిసిటీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ 2 కె 19 గ్రాడ్యుయేషన్ డే శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కృష్ణయ్య మాట్లాడుతూ.. వైద్య రంగాన్ని ఎంచుకున్న వారు వైద్య రంగంలో చోటు చేసుకుంటున్న విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా అప్‌డేట్ కావాలన్నారు. పరిశోధనలు, ఇతర సాంకేతిక వైద్య విధానం గురించి పూర్తి అవగాహన ఉండాలన్నారు. మెడిసిటీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ప్రెసిడెంట్ డాక్టర్ శివరామ కృష్ణ మాట్లాడుతూ.. తమ కళాశాలలో 2019 బ్యాచ్ విద్యార్థులు ఎంబీబీఎస్ పూర్తి చేసుకొని వైద్య రంగంలో ప్రవేశించడం ఆనందంగా ఉందన్నారు. వైద్యులు మనస్ఫూర్తిగా వృత్తికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దేవేంద్ర సింగ్, కళాశాల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



కులకచర్లలో మాట్లాడుతున్న తహసీల్దార్ మనోహర చక్రవర్తి

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

కులకచర్ల/మర్పల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ మనోహరచక్రవర్తి అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం కలెక్టర్ ఆదేశాల మేరకు అవగాహన కల్పించారు. ప్రతీ సంవత్సరం అక్టోబరు 5 నుంచి 12 వరకు ఆర్టీఐ చట్టం దినోత్సవాన్ని జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐలు ఖాజా, రాఘవేందర్‌చారి, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు. అదేవిధంగా మర్పల్లి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పురుషోత్తం సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పర్శురాం, ఆర్ఐ మాధవరెడ్డి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన కారు

» ఒకరి మృతి.. ముగ్గురికి గాయాలు

పరిగి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కారు అదుపు తప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదం పరిగి మండలం ఖుదాంద్‌పూర్ శివారులో శుక్రవారం రాత్రి జరిగింది. పరిగి మండలం రావులపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి రాజు(35), అదే గ్రామానికి చెందిన కె.నరేష్, పాశం శ్రీశైలం, నల్లోల నర్సింహులు కలిసి చిట్యాల్‌లోని కార్పెంటర్ దగ్గర నుంచి ఇంటికి సంబంధించిన సామగ్రిని తీసుకుని రావులపల్లికి వస్తుండగా, ఖుదాంద్‌పూర్ శివారులో కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. కారులో ఉన్న రాజు మృతి చెందగా, నరేష్, శ్రీశైలం, నర్సింహులుకు గాయాలయ్యాయి. పరిగి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఆరోగ్యం ముఖ్యం

కొడంగల్ రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యమని ప్రిన్సిపాల్ డాక్టర్ బి. శీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య అవగాహన దినోత్సం సందర్భంగా విద్యార్థులకు కళాశాల వృక్షశాస్త్ర విభాగం, యు అండ్ మీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు 'విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై సామాజిక మాధ్యమాల ప్రభవం' అనే అంశంపై రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉత్తమ రచనలకు రాష్ట్ర స్థాయిలో బహుమతులు అందజేయనున్నారు. కార్యక్రమంలో వృక్ష శాస్త్ర విభాగాధిపతి రఫియా ఖనం, ఐ.క్యూ. ఏసీ కోఆర్డినేటర్ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.


వ్యాస రచన పోటీల్లో విద్యార్థులు



దుస్తులు, షూ అందించిన ఎంఈవో పురందాస్, దాతలు

విద్యార్థులకు చేయూత అభినందనీయం

చేవెళ్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూతనివ్వడం అభినందనీయమని మండల విద్యాధికారి ఎల్.పురందాస్ అన్నారు. శుక్రవారం చేవెళ్ల మండలంలోని ఎన్కేపల్లి ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు కమల, ఆమె భర్త మనోహర్‌లు పాఠశాల విద్యార్థులకు ఉచితంగా దుస్తులు, షూస్‌ను ఎంఈవో పురందాస్ చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ దాతలు ముందుకువచ్చి పేద విద్యార్థులకు చేయూతనందించడం గొప్ప విషయమన్నారు. ధనం చాలా మంది దగ్గర ఉన్నప్పటికీ దానగుణం కొందరిలోనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మునీర్‌పాషా, గ్రామ కార్యదర్శి రేణు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఆటలకు ఆటంకం

(ఐదో పేజీ తరువాయి)

విద్యార్థుల్లో కూడ ప్రతిభావంతులు ఉన్నారు. కాగా పట్టణంలో క్రీడలకు ప్రత్యేక స్థలమంటూ ఎక్కడా లేకపోవడంతో క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్టేడియం లేక క్రీడల నిర్వహణకు సైతం ఎవరూ ముందుకు రావడం లేదు. క్రీడలపై విద్యార్థులు, యువతకు ఆసక్తి ఉన్నా సరైన ఆటస్థలం లేకపోవడంతో వారు నిరాశకు లోనవుతున్నారు. గతంలో పట్టణంలో క్రీడాపోటీలు నిర్వహించిన సందర్భాలలో ప్రారంభోత్సవ, ముగింపు కార్యక్రమానికి వచ్చిన నేతలు, అధికారులు స్టేడియం నిర్మాణానికి హామీ ఇచ్చి వెళ్లారే తప్ప కార్యరూపం దాల్చలేదు. ఆమనగల్లులోని పాఠశాలల ఆవరణలలో కూడా తగిన స్థలం లేక విద్యార్థులు ఆడుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. సెలవు రోజులు, సాయంత్రం వేళల్లో విద్యార్థులు చివరకు క్రీడాస్థలం లేక పట్టణ సమీపంలోని వ్యవసాయ భూముల్లో, చిన్న పిల్లలైతే ఇళ్ల మధ్య ఖాళీ ప్లాట్లు, అంతర్గత రోడ్లపై ఆడుకుంటున్నారు. ఆమనగల్లు



ఇరుకైన స్థలంలో ఆటలాడుతున్న విద్యార్థులు (ఫైల్)

పట్టణంలో అనేకచోట్ల మినీస్టేడియానికి అవసరమైన స్థలాలు ఉన్నా ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ ప్రయత్నాలు చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఆమనగల్లులో మినీ స్టేడియం నిర్మిస్తే ఐదు మండలాల క్రీడాకారులు, విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది. ఇప్పటికైనా మినీ స్టేడియం నిర్మాణానికి చొరవ తీసుకొని ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని స్థానికులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



ఆమనగల్లు పట్టణంలో మినీస్టేడియం ఏర్పాటు గురించి ఎవరు పట్టించుకోవడం లేదు. గతంలో అనేక మంది ప్రజాప్రతినిధులు, అధికారులు స్టేడియం ఏర్పాటుకు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదు. మినీ స్టేడియం నిర్మాణానికి పట్టణంలో అనువైన ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలి. స్టేడియం నిర్మిస్తే ఆసక్తిగల క్రీడాకారులు శిక్షణ పొందడానికి అవకాశం కలుగుతుంది.

- వత్యనాయక్, ఆమనగల్లు

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ రికవరీ

క్రైం కార్నర్

శంషాబాద్ రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సెల్‌ఫోన్ చోరీకి గురైన సంఘటన శుక్రవారం ఆర్జీఐఏ ఔట్ పోస్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ కనకయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పంజాబ్‌కు చెందిన మన్‌ప్రీత్‌సింగ్ శుక్రవారం ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాడు. ట్యాక్సీ కారులో సెల్‌ఫోన్ మరిచిపోయాడు. కారు దిగిన తరువాత సెల్‌ఫోన్ కనిపించకపోవడంతో ఆర్జీఐఏ ఔట్‌పోస్టు పోలీసులను ఆశ్రయించాడు. అప్రమత్తమైన పోలీసులు గంట వ్యవధిలోనే సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి బాధితుడికి అందజేశారు. ఈ మేరకు ఆయన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

జీవాల సంరక్షణలో జాగ్రత్తలు పాటించాలి

యాచారం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జీవాల సంరక్షణలో జాగ్రత్తలు పాటించాలని, రాత్రివేళ పశువుల దొడ్లు, గొర్రెలు, మేకల మందల వద్ద భద్రత పెంచుకోవాలని, దుండగులు జీవాల చోరీకి పాల్పడకుండా చూసుకోవాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ సూచించారు. ఈమేరకు శుక్రవారం ఆకులమైలారంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. జీవాల చోరీకి పాల్పడే దుండగులను పట్టుకొని పోలీసులకు అప్పగించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు యువత చొరవ తీసుకోవాలన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు బిగించుకోవాలన్నారు. ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమన్నారు. యువకులు గ్రామాభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. మైనర్లు బైక్‌లు నడిపితే తల్లిదండ్రులపై విధిగా కేసులు నమోదు చేస్తామని వెల్లడించారు. యువకులు రాజకీయాలకతీతంగా గ్రామ సమస్యలు పరిష్కరించుకోవడానికి కృషి చేయాలన్నారు. యువకులు శ్రద్ధగా చదువుకొని ఉద్యోగాలు సాధించాలన్నారు.

కరువు తీరా..!

(ఐదో పేజీ తరువాయి)

ఈ ఏడాది సెప్టెంబరు చివరి నాటికి 6.31 మీటర్లు నమోదయ్యాయి. అలాగే గడిచిన ఆగస్టు నెలతో పోలిస్తే సెప్టెంబర్ చివరి నాటికి 1.12మీటర్ల భూగర్భజలాలు పెరుగుదల కనిపించింది. జిల్లాలోని 44శాతం భూప్రాంతంలో అంటే 12 మండలాల్లో 5 మీటర్ల లోపే భూగర్భజలాలు ఉండడం గమనార్హం. అలాగే 14మండలాల్లో (52శాతం భూప్రాంతం) 5-10 మీటర్లలోపు భూగర్భజలాలు ఉన్నాయి. 10 నుంచి 15 మీటర్లలోపు ఒక మండలం (4శాతం భూప్రాంతం)లో భూగర్భజలాలు నమోదయ్యాయి. ఖరీఫ్ (వానాకాలం) సీజన్‌లో దాదాపు 90శాతానికి పైగా పంటలు సాగయ్యాయి. ప్రస్తుతం ఈ సీజన్ ముగియనుండడంతో వచ్చే యాసంగి (రబీ) కూడా ఆశాజనకంగా కనిపిస్తోంది. ప్రస్తుత భూగర్భజలాల పరిస్థితి చూస్తే వచ్చే రబీ కూడా ఎలాంటి ఢోకా ఉండదని భావిస్తున్నారు. భూగర్భజలాలు పుష్కలంగా ఉండడంతో రైతులంతా సంతోషపడుతున్నారు. ముఖ్యంగా నగర శివారు మండలాల్లో భూగర్భజలాలు భారీగా పెరగడంతో వేసవిలో తాగునీటి ఇబ్బందులు కూడా తొలగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మురిపించిన నైరుతి

నైరుతి రుతుపవనాల తిరోగమనమైనప్పటికీ అల్పపీడనాల కారణంగా ఇంకా జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో భారీగా వర్షాలు కురవడంతో జిల్లాలో భూగర్భజలాలు సెప్టెంబర్ నెలాఖరు నాటికి గణనీయంగా పెరిగాయి. రబీ ఆరంభంలో కూడా భారీగా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణశాఖ వెల్లడించింది. ఇదిలా ఉంటే ఈ ఖరీఫ్ సీజన్‌లో జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వర్షాలు దంచికొట్టాయి. ముఖ్యంగా గడిచిన రెండు నెలలుగా ఎడతెరిపి లేకుండా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సగటు కంటే 46శాతం అధిక వర్షపాతం నమోదైంది.

మండలాల వారీగా భూగర్భజలాలు (సగటు మీటర్లలో)

మండలం	ఆగస్టు	సెప్టెంబరు
అబ్దుల్లాపూర్‌మెట్	3.75	2.22
ఆమనగల్లు	2.74	3.28
బాలాపూర్	3.74	3.67
చేవెళ్ల	3.79	3.65
చౌదరిగూడెం	6.54	4.32
ఫరూఖ్‌నగర్	6.89	6.04
గండిపేట	8.87	8.99
హయత్‌నగర్	7.48	6.96
ఇబ్రహీంపట్నం	18.57	14.25
కడ్తాల్	9.30	9.80
కందుకూరు	3.86	3.50
కేశంపేట	3.57	4.31
కొందుర్గు	4.70	4.12
కొత్తూరు	8.32	6.97
మాడ్గుల	6.58	5.31
మహేశ్వరం	8.07	6.61
మంచాల	12.14	9.12
మొయినాబాద్	4.07	3.75
నందిగామ	1.39	1.72
రాజేంద్రనగర్	4.79	6.01
సరూర్‌నగర్	8.98	8.74
శేరిలింగంపల్లి	8.58	6.71
షాబాద్	4.48	4.00
శంషాబాద్	4.51	4.92
శంకర్‌పల్లి	10.99	7.05
తలకొండపల్లి	10.88	8.72
యాచారం	10.64	7.22

ఇప్పటి వరకు జిల్లాలో సగటు 580మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటికే 850మి.మీ వర్షం కురిసింది. దాదాపు 46శాతం అధికంగా ఈ సీజన్‌లో వర్షం కురవడం గమనార్హం. దాదాపు అన్ని మండలాల్లో 30 నుంచి 40 శాతానికి మించి అధిక వర్షపాతం నమోదైంది. అత్యధికంగా షాబాద్ మండలంలో 81శాతం వర్షపాతం నమోదైంది. నందిగామ 66శాతం, కొత్తూరు 63శాతం అధిక వర్షం కురిసింది. అలాగే కరువు ప్రాంతాలైన ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం మండలాల్లో దాదాపు 50శాతం అధికం వర్షపాతం నమోదైంది.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం : సీడీపీవో



మంచాల : లోయపల్లిలో నిర్వహించిన పోషణమాసం కార్యక్రమంలో సీడీపీవో వినీతాదేవీ తదితరులు

మంచాల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఉంటారని ఇబ్రహీంపట్నం సీడీపీవో వినీతాదేవీ అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పోషణమాసంలో భాగంగా శుక్రవారం మంచాల మండల పరిధి లోయపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక శ్రీమంతాలు, అన్నప్రాసన, వెల్‌బేబీషో, పోస్టర్ మేకింగ్, క్విజ్, వ్యాసరచన పోటీలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో వినీతాదేవీ ఐవైసీఎఫ్, ఒబెసిటీ, పురుషుల భాగస్వామ్యం యొక్క ప్రాముఖ్యతలను వివరించారు. శిశువుల పోషణ, అభివృద్ధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గర్భిణులకు పలు సూచనలు చేశారు. వంటల్లో నూనె, చక్కెర వాడకాన్ని తగ్గించినట్లయితే కొంతవరకు ఊబకాయాన్ని అరికట్టవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విద్యుల్లత, కల్పన, బీసీ శ్రీనివాస్, సీసీలు, ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కేశంపేట : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని కేశంపేట సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దివ్యాసింగ్ అన్నారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ అంగన్‌వాడీ-1 కేంద్రంలో శుక్రవారం పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సూపర్‌వైజర్ హాజరై పౌష్టికాహారం గురించి వివరించారు. గర్భిణులు, బాలింతలు ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, గుడ్లు, చేపలు, మాంసం, పప్పుదినుసులు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. సమయానికి ఆహారం తీసుకోవాలని తెలిపారు. పిల్లలకు సంపూర్ణ పోషక ఆహారం ఇవ్వాలని సూచించారు. కిశోర బాలికల్లో రక్తహీనత లేకుండా సరైన ఆహారం తీసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట : బాలింతలు, గర్భిణులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అంగన్‌వాడీ సూపర్ వైజర్ దివ్యాసింగ్

మహాసభలను విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

చేవెళ్ల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఐదో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లి దేవేందర్ తెలిపారు. శుక్రవారం చేవెళ్ల మున్సిపల్ కార్యాలయం ఆవరణలో యూనియన్ నాయకులతో కలిసి పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 14, 15వ తేదీల్లో తుర్కయంజాల్‌లోని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఐదో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్మికులు, ఉద్యోగులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరేష్, కోశాధికారి సిద్దమ్మ, ఉపాధ్యక్షులు దస్తగిరి, నాయకులు జనార్దన్, రంగా, రాఘవేందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలి



ఫ్లెక్సీలను ఏర్పాటు చేయిస్తున్న ఎక్సైజ్ సీఐ బద్యనాథ్

ఆమనగల్లు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల, ఆమనగల్లు మండలాల్లో మద్యం దుకాణాల లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ కోరారు. మద్యంషాపుల లైసెన్స్ దరఖాస్తులపై అవగాహన కల్పించడానికి పలుచోట్ల ఫ్లెక్సీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణంలోని ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల్లో 17 మద్య దుకాణాలు ఉన్నాయని, దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందన్నారు. ఇప్పటివరకు 17 దర ఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 18లోపు దరఖాస్తు చేసుకోవాలని సీఐ చెప్పారు. ఏమైనా సందేహాలుంటే ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

శంకర్‌పల్లి లబ్ధిదారులు 'రేషన్ షాపు-35'లో సరుకులు తీసుకోవాలి

శంకర్‌పల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : శంకర్‌పల్లి మున్సిపాల్ పరిధిలోని రేషన్‌దుకాణం నెంబర్-18లో రేషన్ తీసుకునే లబ్ధిదారులు దుకాణం నెంబర్-35లో తీసుకోవాలని శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్ ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాలిటీలో కొనసాగుతున్న రేషన్ నెంబర్-18 దుకాణం నిర్వాహకుడు అనంతయ్య అనారోగ్య కారణాల వల్ల డీలర్‌షిప్‌ను వెనక్కి తీసుకోవాల్సిందిగా ఆర్డీవో చంద్రకళకు వినతి పత్రం అందజేశారని చెప్పారు. ఈమేరకు అధికారులు డీలర్ అభ్యర్థన మేరకు 18వ రేషన్ దుకాణంలో రేషన్ తీసుకునేవారు 35వ షాపులో తీసుకోవాలని లబ్ధిదారులకు తహసీల్దార్ సూచించారు.

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు



రామచంద్ర విద్యాలయంలో సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న మండల విద్యాధికారి కస్నానాయక్

- మహేశ్వరం మండల విద్యాధికారి డాక్టర్ కస్నానాయక్
- కోళ్లపడకల్‌లోని రామచంద్ర విద్యాలయం పరిశీలన
- పాఠశాలలో సౌకర్యాలపై తీవ్ర అసంతృప్తి
- నిర్లక్ష్యపు సమాధానమిచ్చిన యాజమాన్యం!

మహేశ్వరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రయివేటు పాఠశాలలు ప్రభుత్వ నియమ నిబంధనలు తప్పక పాటించాలని, నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోకతప్పదని మండల విద్యాధికారి డాక్టర్ కస్నానాయక్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని కోళ్లపడకల్‌లోని రామచంద్ర విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామచంద్ర విద్యాలయంలో తరగతి గదులు ఇరుకుగా ఉండడమే కాకుండా తలుపులు, కిటికీలు కూడా లేవన్నారు. ముఖ్యంగా సెక్యూరిటీ మెజర్స్ ఫ్యాన్లు లేవన్నారు. తరగతి గదుల్లో విద్యుత్ వైర్లు వేలాడడం, బెంచీలు కూడా సరిగ్గా లేకపోవడం లాంటి విషయాలు వెలుగులోకి వచ్చాయన్నారు. అదేవిధంగా విద్యార్థులకు వాష్‌రూమ్స్, ఆటస్థలం లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే వాస్తవాలు తమ దృష్టికి వచ్చాయన్నారు. పాఠశాలలో కనీస సౌకర్యాలు లేవని సంబంధిత యాజమాన్యాన్ని ప్రశ్నించగా.. ఇక్కడ ఇలాగే ఉంటాయి ఏం చేసుకుంటారో చేసుకోండి, ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండంటూ నిర్లక్ష్యపు సమాధానం ఇవ్వడం ఎంతవరకు సమంజసమన్నారు. రామచంద్ర విద్యాలయం తీరుపై నివేదిక తయారు చేసి సంబంధిత విద్యాశాఖ ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

మంచాల మండల వ్యవసాయాధికారిగా వెంకటేశ్



మంచాల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మంచాల మండల వ్యవసాయాధికారిగా జి.వెంకటేశ్ బదిలీపై వచ్చారు. ఆయన ఇదివరకు యాదాద్రి-భువనగిరి జిల్లా గాజులరామారం మండలంలో పనిచేశారు. ఇప్పటిదాకా మంచాలలో పనిచేసిన ఏవో శ్రీలత ఏడీఏ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఏవో వెంకటేశ్ మాట్లాడుతూ అన్నదాతలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహిస్తానని తెలిపారు. రైతులు వ్యవసాయ సంబంధిత సమస్యలపై తన ఫోన్ నెంబర్ : 89777-53830ను సంప్రదించాలన్నారు.

షాబాద్ మండలాధికారిగా విజయచంద్ర



షాబాద్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): షాబాద్ మండల వ్యవసాయ అధికారిగా దండెం విజయచంద్ర శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కాగా, ఆయన నల్గొండ జిల్లాలోని నిడమనూరు మండలంలో వ్యవసాయ విస్తరణ అధికారిగా విధులు నిర్వహించారు. పదోన్నతిపై షాబాద్ మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తామని తెలిపారు.

రోడ్డుకు మరమ్మతులు.. ట్రాఫిక్ పోలీసులకు అభినందనలు



మరమ్మతులు చేయిస్తున్న ట్రాఫిక్ జోన్ సీఐ వెంకటేశ్వర్‌రావు

మహేశ్వరం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా రోడ్లన్నీ గోతులమయం కావడంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈమేరకు మహేశ్వరం జోన్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్, సీఐ వెంకటేశ్వర్‌రావులు మాట్లాడుతూ వాహనదారులు జాగ్రత్తగా రైడ్ చేయాలని సూచించారు. మహేశ్వరం ట్రాఫిక్ జోన్ పరిధిలోని ఆర్‌సీఐ రోడ్డు వర్షాలకు పూర్తిగా దెబ్బతినడంతో శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు గుంతలుగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా వారికి ప్రయాణికుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. ప్రజాప్రతినిధులు, ఆర్అండ్‌బీ అధికారులు చేయాల్సిన పనిని వారు చేస్తున్నందుకు నియోజకవర్గం ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై పాండు. సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



గెలుపొందిన క్రీడాకారులతో మధుసూదన్‌రెడ్డి

షాబాద్/మొయినాబాద్ రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఏఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో షాబాద్‌లో పీఆర్ఆర్ మినీస్టేడియంలో నిర్వహించిన 69వ మండల స్థాయి ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ జూనియర్, సీనియర్ లెవల్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు శుక్రవారం బహుమతులు అందజేశారు. పోటీల్లో 15 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 450మంది విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు. మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, మాజీ సర్పంచులు నర్సింహులు, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్‌గౌడ్, లింగం, నాయకులు సుభాష్‌రెడ్డి, రాహుల్, కిషోర్, గౌరీశ్వర్, రఫీక్, సూర్యగౌడ్, శ్రీనివాస్, శేఖర్, మాధవరెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

కాగా, విద్యార్థులకు క్రీడలు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తాయని.. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మొయినాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొత్త మాణిక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 69వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడల పోటీల సందర్భంగా చేవెళ్ల డివిజన్ స్థాయి క్రీడాకారులను ఎంపిక చేసేందుకు పలు క్రీడాపోటీలను నిర్వహించారు. ఈమేరకు ఆయన తన తండ్రి కీ.శే కొత్త అనంతరెడ్డి జ్ఞాపకార్థం సొంత డబ్బుతో శుక్రవారం నిర్వహించారు. మొయినాబాద్ బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు కొత్త మాణిక్‌రెడ్డి, మండల విద్యాధికారి మల్లయ్యలు పోటీలను ప్రారంభించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమేనని, ఓడిపోయామని చింతించకుండా గెలుపుకోసం ప్రయత్నించాలన్నారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్ రూరల్ : పోటీలను ప్రారంభిస్తున్న మాణిక్‌రెడ్డి

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిది



సన్మానం పొందిన ఉపాధ్యాయులతో ఎంఈవో పాండురంగారెడ్డి

యాచారం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు పాత్ర వెలకట్టలేనిదని యాచారం ఎంఈవో పాండురంగారెడ్డి అన్నారు. శుక్రవారం యాచారం మండల కేంద్రంలో సాయిశరణం గార్డెన్‌లో 32 మంది మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఆయన ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి, యాచారం ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు ఉదయశ్రీ, నరసింహ, పీఆర్టీయూ అధ్యక్ష కార్యదర్శులు తిరుమలేశ్, యాదగిరి, టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు అంజయ్య, ధన్‌రాజ్, వివిధ గ్రామాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం విజయవంతం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మంచాల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధి జాపాలలో శుక్రవారం ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతమైంది. నగరంలోని వాసన్ ఐకేర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిబిరంలో దృష్టి లోపం ఉన్నవారికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. నాయకులు, వైద్యబృందం పాల్గొన్నారు.

13న ఉచిత కంటి వైద్యశిబిరం

ఆమనగల్లు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు ప్రభుత్వం ఆసుపత్రి ఆవరణలో ఈనెల 13న ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, పీఆర్ పాషాలు ప్రకటనలో తెలిపారు. శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఐవోఎల్ ఆపరేషన్లు చేయించడం జరుగుతుందని వారు తెలిపారు.

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలి

మొయినాబాద్ రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మొయినాబాద్ మండల బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు అరవింద్ రజక శుక్రవారం ఆర్ఎస్పీని ఆయన నివాసం లో మర్యాదపూర్వకంగా కలిశాడు. ఆర్ఎస్పీ మాట్లాడుతూ చేవెళ్ల నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేయాలని, తెలంగాణలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేసినట్లు అరవింద్ పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు సీసీ కెమెరాల వితరణ

కేశంపేట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కేశంపేట సీఐ నరహరి సూచన మేరకు శుక్రవారం మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామ ప్రభుత్వ పాఠశాలకు బీఆర్ఎస్ నాయకులు సీసీ కెమెరాలు అందించారు. అల్వాల ప్రభుత్వ పాఠశాలకు విక్రమ్ వెంచర్స్ యాజమానులు విక్రమ్ దేవారెడ్డి, వెంకట్ దిలీప్‌లు సీసీ కెమెరాలు అందించారు. బొదునంపల్లి పాఠశాలకు మాజీ ఉపసర్పంచ్ నీల లావణ్య పాండు సీసీ కెమెరాలను అందించారు. పీసీ అశోక్‌రెడ్డి, పృథ్వీరాజ్, తరేష్‌యాదవ్, మణికంఠ, గోపాల్ నాయక్, లింగారెడ్డి, ఉపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి, ప్రసాద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ఎక్లాస్‌ఖాన్‌పేట పాఠశాలకు సీసీ కెమెరాలు అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు